క్లుప్తంగా

బాడీ బిల్డింగ్ పోటీల్లో ఏఎన్నార్ కాలేజీ విద్యార్థి ప్రతిభ



గుడివాడ టౌన్: ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి ప్రతిభ చాటి బంగారు పతకం సాధించాడని ఏఎన్నార్ కాలేజీ ప్రిన్సిపాల్ పి.జె.ఎస్.కుమార్ తెలిపారు. బంగారు పతకం సాధించిన విద్యార్థి నితీష్‌కుమార్‌ను బుధవారం కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఏలూరు జిల్లా చింతలపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో నత్తా నితీష్‌కుమార్ 75 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.ఎస్.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్.పద్మజ, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించండి

ముదినేపల్లి రూరల్: డ్రెయిన్ తవ్వకాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని స్థానిక ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ డ్రెయినేజీ అధికారులు, డీసీ చైర్మన్, నీటి సంఘాల అధ్యక్షులకు సూచించారు. మండలంలోని పెదకామనపూడి వద్ద పెదకొమ్మిలేరు డ్రెయిన్ తవ్వకం, గుర్రపుడెక్క తొలగింపు పనులు ఎమ్మెల్యే కామినేని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయిన్ పూడుకుపోవడంతో పాటు గుర్రపుడెక్క, కిక్కిస విపరీతంగా పెరిగిపోయి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారిందన్నారు. దీంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ పరిస్థితి నుంచి రైతులను కాపాడేందుకు పెదకొమ్మిలేరు మేజర్ డ్రెయిన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వీరమల్లు నరసింహారావు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ డ్రెయిన్ నిర్మాణ పనులు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. స్థానిక పాత దళితవాడలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద నుంచి ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి వరకు డ్రెయినేజీ నిర్మాణ పనులు వారం రోజులుగా జరుగుతున్నాయి. మండల పరిషత్ నిధులు రూ.8 లక్షల వ్యయంతో సుమారు 235 మీటర్ల పొడవున డ్రెయిన్ నిర్మాణం జరుగుతోంది. డ్రెయిన్ నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ సుబ్బారావు పర్యవేక్షిస్తున్నారు.

రైతు బజారులో తనిఖీలు

గుడివాడ టౌన్: స్థానిక మార్కెట్ సెంటర్‌లోని రైతు బజారులో బుధవారం సాయంత్రం అధికారులు తనిఖీలు చేశారు. డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ విజయ సునీత ఆధ్వర్యంలోని మార్కెటింగ్ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఆమె రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధరల పట్టికలపై రైతుల అభిప్రాయాలను సేకరించారు. రైతు బజారులో వసతులు, ఇతర అంశాలను రైతులతో స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు బజారులో వసతులు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. క్యాబేజీ రైతులు విజ్ఞప్తి మేరకు రూ. 2 ధర పెంచుతూ పట్టిక వేయాలని ఈఓకు సూచించారు. కార్యక్రమంలో జేడీ మార్కెటింగ్ శ్రీనివాస్, ఏడీ మార్కెటింగ్ నిత్యానందం, మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్, మార్కెటింగ్ డీఈలు, ఏఈలు, ఈఓ షేక్ అమీర్ బాబు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలని వినతి

పమిడిముక్కల: డీఎల్‌పీఓ రాజేష్, ఎంపీడీఓ దేవరపల్లి వెంకటేశ్వరరావుకు తమ పని భారం తగ్గించాలని కార్యదర్శులు వినతిపత్రాలు అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వినతిపత్రంఅందజేసి సమస్యలను వివరించారు. రోజూ యాప్‌లు, సర్వేలతో సతమతమవుతున్నామన్నారు. చెత్త సేకరణ, మూడో శనివారం తదితర కార్యక్రమాలతో ఉదయం ఐదు నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామాల్లోనే ఉండాల్సి వస్తోందన్నారు. పీ4 సర్వేతో పని ఒత్తిడి పెరిగిందని, అనారోగ్యం పాలవుతున్నామని వివరించారు.

నేడు దుకాణాలకు వేలంపాట

పామర్రు: దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉన్న దుకాణాలకు ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పామర్రు గ్రూపు ఆఫ్ దేవాలయాల మేనేజర్ జన్ను వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. స్థానిక శ్రీబొమ్మారెడ్డి పెద బుల్లియ్య ఎలియాస్ వెంకటరెడ్డి సత్రంలోని షాపు నం.18/5ను మూడేళ్ల పాటు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ధరావత్తుగా రూ.20వేల చెల్లించాలని తెలిపారు. అదేవిధంగా 18/11 షాపునకు మూడేళ్ల పాటు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ధరావత్తుగా రూ.5వేలు చెల్లించాలని తెలిపారు.

ప్రజల సంక్షేమం కోసం పోరాటం

ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం



పామర్రులో కేకును కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: పద్నాలుగు ఏళ్లుగా ప్రజా ప్రస్థానాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం పోరాటం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను కైలే అనిల్‌కుమార్ ఆవిష్కరించారు. దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పోరాటాలే శ్వాసగా, జగనన్న నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి సమష్టిగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేద్దామన్నారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, రాజ్యలక్ష్మి, వెంకటేశ్వరరమ్మ, రత్నకుమారి, మహేష్, పార్టీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, రాఘవరావు, సోమేశ్వరరావు, జమీగొల్వేపల్లి సర్పంచ్ శాంతకుమారి, ఉప సర్పంచ్ బాలవెంకటేశ్వరరెడ్డి, నాయకులు కంభపు రాంబాబు, రాజు, సుబ్రమణ్యం, కె.శ్రీనివాసరావు, మురళీ, అప్పిరెడ్డి, నత్తా నాని, సింహాచలం, రవి, కుందేటి రాణి తదితరులు పాల్గొన్నారు.

లింగవరంలో..

గుడివాడరూరల్: 14 ఏళ్ల ప్రస్థానంలో వైఎస్సార్ సీపీ ప్రయాణం ఓ చరిత్ర అని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ పేర్కొన్నారు. మండలంలోని లింగవరంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.



లింగవరంలో వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న విక్టర్

తొలుత పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పార్టీ జెండాను ఆవిష్కరించి జై జగన్, జైజై జగన్ అంటూ నినాదాలు చేశారు. ఎంపీపీ గద్దే పుష్పరాణి, జెడ్పీటీసీ సభ్యుడు గొల్ల రామకృష్ణ, నాయకులు నాగబాబు, ఈశ్వర్‌కుమార్, శ్రీహరి, చంటిబాబు, మహేంద్ర, గిరి, శ్రీకాంత్, నాని, చిన్ని పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని గుడ్లవల్లేరులో ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక వైఎస్సార్ బ్రిడ్జిపై ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులు నివాళులర్పించారు. ఎంపీపీ కొడాలి సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు నాగు, మట్టా కమల, పిన్నమనేని రాఘవేంద్రరావు, రవి, జాన్ బెన్నీ, కొడాలి సుధాకర్, లక్ష్మీ, బాజీ పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా నిరంతర పోరాటాలు చేస్తామని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఎంపీపీ పెయ్యల ఆదాం పేర్కొన్నారు. నందివాడలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులు మచిలీపట్నంలో నిర్వహించిన యువత పోరు కార్యక్రమానికి తరలి వెళ్లారు. జెడ్పీటీసీ సభ్యురాలు కందుల దుర్గా భవాని, నాయకులు కందుల నాగరాజు, తోట నాగరాజు, రంగారెడ్డి, చంద్రశేఖర్, సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి, నాగేశ్వరరావు, చంద్రశేఖర్, చింతాడి నాగూర్ తదితరులు పాల్గొన్నారు.



నందివాడ మండలంలో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

సవాళ్లతో ఏర్పడిన పార్టీ వైఎస్సార్ సీపీ

గుడివాడ టౌన్: పేదలకు అండగా ఉండాలనే తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి సవాళ్లను ఎదుర్కొంటూ ఏర్పరచిన పార్టీ వైఎస్సార్ సీపీ అని ఆ పార్టీ నాయకులు అన్నారు. స్థానిక 35వ వార్డులో బుధవారం వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసి కేక్ కట్‌చేసి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, సీనియర్ నాయకుడు పాలేటి చంటి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తులిమిల్లి యెషయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకుడు వెంపటి సైమన్, ఏలేటి విలియం జోషి, టి.రమణకుమార్, కృష్ణమోహన్, సీహెచ్ జోషి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ సయ్యద్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ బాజీ, కె.ఆంజనేయ ప్రసాదు, చుండూరి శేఖర్, తోట రాజేష్, మామిళ్ల ఎలీషా, మహిళా విభాగం అధ్యక్షురాలు మాదాసు వెంకటలక్ష్మీ కుమారి, మహిళా కార్యకర్తలు సురేఖ, సునీత, రమీజ, మూడెడ్ల ఉమ పాల్గొన్నారు.



గుడివాడలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాటం



కైకలూరులో జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: ప్రజల సమస్యల పరిష్కారంలో ఎన్నడూ తమ పార్టీ ముందుండి పోరాడుతుందని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కైకలూరు సంతమార్కెట్ వద్ద బుధవారం మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పాలన చరిత్రలో మరువలేమన్నారు. అనంతరం ఏలూరులో యువత పోరు కార్యక్రమానికి భారీగా నాయకులు, కార్యకర్తలతో కలసి వెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముదిరాజుల సంఘం అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు, రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ సెక్రటరీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, రాష్ట్ర వాణిజ్య విభాగ సెక్రటరీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర మహిళా విభాగ సెక్రటరీ గంటా సంధ్య, రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ బలే నాగరాజు, ఏలూరు జిల్లా ఉపాధ్యక్షుడు చేబోయిన వీర్రాజు, జిల్లా నాయకులు జయమంగళ కాసులు, మహాదేవ విజయబాబు, నాగదాసి థామస్, అర్జునరావు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు రాము, రమేష్, యోసోబురాజు, రామరాజు, నాయకులు గుమ్మడి వేంకటేశ్వరరావు, చాన్‌బాషా, వైఎస్ ఎంపీపీ రాచూరి రాధా, కైకలూరు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

యువతను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్



ర్యాలీని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్

పామర్రు: ఆచరణసాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు, యువతకు దక్కాల్సిన పథకాలను అందకుండా చేసి వారిని ఘోరంగా మోసం చేసిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి వేలాది మంది వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు విద్యార్థులు కలిసి యువత పోరుకు బుధవారం బయలు దేరారు. తొలుత జెండా ఊపి అనిల్‌కుమార్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని కాలరాస్తోందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. సూపర్ సిక్స్ పేరుతో గద్దెనెక్కిన నాయకులు ఇప్పుడు సంక్షేమ పథకాలను విస్మరించారని మండి పడ్డారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా అవస్థల పాల చేస్తున్నారన్నారు. యువతకు ఉద్యోగాలు, కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. విద్యార్థులకు అండగా నిలవాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు పార్టీ శ్రేణులు పోరులో పాల్గొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి అశోక్‌కుమార్, ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, తిరుమలశెట్టి వాసు, తాడిశెట్టి శ్రీను, కళ్లం వెంకటేశ్వరరెడ్డి, శొంఠి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల విద్య, ఆరోగ్యంపై దృష్టిపెట్టాలి

గుడివాడ టౌన్: అంగన్‌వాడీ కార్యకర్తలు చిన్నారుల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీడీపీఓ విజయా ఫ్లారెన్స్ అన్నారు. బుధవారం స్థానిక ఏజీకే హైస్కూల్, ఏకేటీపీ బాలికల పాఠశాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పోషణ్ భీ-పడయాభి కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. శిక్షణలో భాగంగా చిన్నారుల విద్యావిధానాన్ని ఆమె వివరించారు. చిన్నారులకు సంబంధించిన సూక్ష్మ లోపాలను గ్రహించి వాటిని తల్లిదండ్రులకు తెలియచేయడం వలన వారి ఆరోగ్య పరిరక్షణపై కార్యకర్తలు దృష్టిపెట్టినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయంతి, భవాని, శిరీష, నజీరున్నీసా పాల్గొన్నారు.



శిక్షణ తరగతిలో ప్రసంగిస్తున్న సీడీపీఓ విజయా ఫ్లారెన్స్

నయనానందకరం కూచిపూడి నృత్యం



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థినుల నృత్యం

కూచిపూడి(మొవ్వ): శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సిద్ధేంద్ర యోగి కళా వేదిక పై నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు నయనానందకరంగా సాగుతున్నాయి. రెండో రోజైన బుధవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విద్యార్థినులు భార్గవి, శ్రీలత, శ్రీ వత్సల, వసుధ, సాత్విక, మౌనిక, లలిత, దీక్షిత, హర్షిత సంకట నాగ గణపతి స్తోత్రం, కాంచీపూరి అమ్మవారి తిల్లానా, తిలువ రాజేంద్ర శబ్దం, నర్తన గణపతిం అనే ప్రార్థనా గీతంతో పాటు రామదాసు కీర్తనలను చక్కని హావ భావాలతో లయానుగుణంగా నర్తించి ప్రేక్షకుల కరతాళ ధ్వనులు అందుకున్నారు. అనంతరం కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్, ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్ అవార్డు గ్రహీత డాక్టర్ చింతా రవి బాలకృష్ణ నృత్య దర్శకత్వంలో రూపొందించిన మోహినీ భస్మాసుర నృత్య నాటకం ఆహూతులను అలరింపజేసింది. భస్మాసురుడిగా ద్రాక్షాయణి, మోహినిగా నాగశ్రీ ప్రవల్లిక, శివుడుగా వర్షిత వర్మ, పార్వతిగా యశశ్రీ, విష్ణుమూర్తిగా శ్రావ్య గ్రీష్మ, లక్ష్మీదేవిగా మేఘన, నారదుడిగా స్నేహిత తమ పాత్రలకు న్యాయం చేసి నృత్యాంశానికి జీవం పోశారు. నిర్వాహకులు కళారత్న వేదాంతం రాధేశ్యామ్ కళాకారులను, నాట్యాచార్యులను శాలువాలతో, జ్ఞాపికలతో సత్కరించారు.

పదో తరగతి పరీక్షల ఏర్పాట్లు పూర్తి



గన్నవరం: ఈ నెల 17 నుండి 31వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి గుడివాడ డివిజన్ పరిధిలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఉప విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్ బుధవారం తెలిపారు. ఈ విద్యా ఏడాది పదవ తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా సంసిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

మొత్తం 12,624 మంది విద్యార్థులు

గుడివాడ డివిజన్‌లోని 14 మండలాలకు చెందిన మొత్తం 12,624 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. వీరితో పాటు ఒకసారి పరీక్షల్లో తప్పిన వారు 784 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. వీరిందరి కోసం గుడివాడ డివిజన్‌లో 83 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా పరీక్ష కేంద్రాల్లో బెంచీలు, ఫ్యాన్లు, ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్లు, టాయిలెట్స్, మంచి వెంటిలేషన్ ఉండే విధంగా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం



ముదినేపల్లి రూరల్: మండలంలోని గురజ శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు ఆర్.తేజోరామ్, పరాశం, పి.రంగానాథాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ తంతు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కల్యాణానికి హాజరయ్యారు.

ఉద్యోగం పేరుతో మోసం

ముదినేపల్లి రూరల్: ఉద్యోగం ఇప్పిస్తానని ఓ యువతిని నమ్మించి రూ.2 లక్షలు కాజేసి ఆ పై ఉడాయించిన వ్యక్తిపై స్థానిక పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ముదినేపల్లికి చెందిన ఒక యువతి ఉద్యోగ ప్రయత్నంలో ఉండగా ఆమె బంధువుల ద్వారా కైకలూరుకు చెందిన వెంకట్ అనే వ్యక్తి యువతిని పరిచయం చేసుకుని ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఇందుకు రూ.2 లక్షలు చెల్లించాలని కోరగా ఆన్‌లైన్‌లో అడిగిన మొత్తాన్ని యువతి చెల్లించింది. అప్పటి నుంచి వెంకట్ ఆచూకీ లేకుండా పోవడంతో యువతి మోసపోయానని గ్రహించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

ముదినేపల్లి రూరల్: స్వయం ఉపాధి రుణాలు పొందడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వై.రామకృష్ణ కోరారు. వెనుకబడిన వర్గాలకు సంబంధించి 18 నుంచి 50 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు స్వయం ఉపాధి రుణాలు పొందడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా బీసీ, కాపు, అగ్రవర్ణ మహిళలు కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల మహిళలు రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతో ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

'మా భూమిని కాపాడండి'



డెప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ముదినేపల్లి రూరల్: తరతరాలుగా సాగు చేసుకుంటున్న తమ భూమిని స్వాధీనం చేసుకోకుండా కాపాడాలంటూ మండలంలోని కొత్తపల్లికి చెందిన దళితులు వేడుకున్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఇందుకు సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు స్థానిక దళితులకు మద్దతు పలికి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మండలంలోని వణుదుర్రు శివారు కొత్తపల్లిలో ఆర్ఎస్ నంబర్ 415లో 1.85 ఎకరాల భూమిని 1958 నుంచి ఎస్టీలుగా పరిగణించబడే పాముల కులానికి చెందిన దాసరి బలరాముడు, ఆశీర్వాదం, శ్రీనివాసరావు, వెంకన్న, జల్లు రాముడు, వెంకటేశ్వరరావు, రామారావు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వానికి శిస్తులు చెల్లిస్తున్నారన్నారు. ఈ భూమిని స్వాధీనం చేసుకుని పంచాయతీ ఆధ్వర్యంలో చెరువు తవ్వేందుకు కూటమి నాయకులు ప్రయత్నాలు చేస్తూ బుధవారం కొలతలు వేసి భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. భూమి స్వాధీనం చేసుకుంటే అనుభవదారులు జీవనాధారం కోల్పోతారని ఈ విధంగా జరగకుండా రక్షణ కల్పించాలని కోరుతూ డెప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

రామలింగేశ్వరస్వామికి వెండి హారతి బహూకరణ



కూచిపూడి(మొవ్వ): కూచిపూడి నాట్యాచార్యుల ఇలవేల్పు శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామికి పమిడిపక్కల మండలం అగినిపర్రు వాస్తవ్యులు వేమూరి శ్రీహరి శ్రీనివాస్, దుర్గ దంపతులు వెండి ఓంకార హారతిని బుధవారం బహూకరించారు. రూ.64 వేల విలువ గల హారతిని ఆలయ పాలకమండలి కార్యదర్శి భాగవతుల బాలకృష్ణ ప్రసాద్, కార్యవర్గ సభ్యులు భాగవతుల సీతారామారావుకు తమ కుటుంబ సభ్యులతో కలిసి అందజేశారు. అర్చకులు పెనుమూడి పూర్ణ చంద్రశేఖర శర్మ, సతీష్ కుమార్ శర్మ, ఉదయేశ్వర్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకోవాలి



గుడివాడ టౌన్: విద్యార్థి దశలోనే వారి భవిష్యత్‌పై ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలని కెరియర్ కౌన్సిలర్ డాక్టర్ ఏపూరి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల్లో రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని గురిగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్, కార్యదర్శి జి. కిరణ్‌బాబు, కోశాధికారి ఎస్. ప్రసాదు, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. రవీంద్రబాబు పాల్గొన్నారు.